సాక్షి
శ్రీకాకుళం
బుధవారం । 27 । ఆగస్టు । 2025



పరిశోధనలకు ప్రోత్సాహం..!

ఔత్సాహిక విద్యార్థులను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందుకోసం 'ప్రయాస్' కార్యక్రమానికి రూపకల్పన చేసింది. - 2లో



డైరెక్టర్ మనోడే మరి

సిక్కోలుకు చెందిన సృజన్ 'కన్యాకుమారి' చిత్రానికి దర్శకత్వం వహించాడు. శ్రీకాకుళం పరిసరాల్లోనే షూటింగ్ పూర్తి చేయడం విశేషం. - 2లో

రోడ్డుపై చేపల వేట..



చేపలు పడుతున్న స్థానికులు

శ్రీకాకుళం: నగర శివార కాలనీలైన ఇందిరాగా నగర్, గోవిందనగర్ కాలనీలో రోడ్లపైకి చేపలు వచ్చాయి. ఈ ప్రాంతంలో సాగునీటి కాలువ ఉండటంతో ఆ నీరు రోడ్లపైకి రావడంతో చేపలు కొట్టుకొచ్చాయి. స్థానికులు వర్షాన్ని కూడా లెక్క చేయకుండా చేపలు పట్టారు.

పెద్దపాడు వద్ద జాతీయ రహదారిపై నీరు పోటెత్తడంతో వాహనచోదకుల పాట్లు



దంచికొట్టింది..

జిల్లాలో 360 మి.మీ. వర్షం

శ్రీకాకుళం పాతబస్టాండ్: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో మంగళవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా 360.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

	శ్రీకాకుళం	ఎచ్చెర్ల	ఆమదాలవలస	సంతబొమ్మాళి	నరసన్నపేట	లావేరు	టెక్కలి	కోటబొమ్మాళి	రణస్థలం	పోలాకి	గార	జలుమూరు	ఇచ్ఛాపురం
మి.మీ.లో	52.4	28.8	23.0	19.6	18.2	18.6	17.6	17.6	15.2	13.4	11.8	22.8	12.0



బలగ హడ్కోకాలనీలో ఇళ్ల చెంత వర్షపు నీరు

- ఎడతెరిపి లేని వర్షంతో వణికిన సిక్కోలు
- జలమయమైన ప్రధాన రహదారులు, కాలనీలు
- నీట మునిగిన పంట పొలాలు
- ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ముంచెత్తిన వరద
- శ్రీకాకుళంలో 52.4 మిల్లీమీటర్ల వర్షం
- నేడు కూడా వర్షాలు కురిసే అవకాశం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ)/శ్రీకాకుళం/శ్రీకాకుళం అర్బన్: వాన దంచికొట్టింది. జిల్లాలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి సిక్కోలు జల దిగ్బంధంలో చిక్కుకుంది. జిల్లా కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల్లో రోడ్లన్నీ జలమయమయ్యాయి. పీఎన్ కాలనీ, రైతుబజారు కొత్తరోడ్డు, బలగ, హాస్పిటల్ రోడ్డు, గుజరాతిపేట, ఏపీహెచ్‌బీకాలనీ, హయాతి నగరం, అరసవల్లి ఆదిత్యనగర్‌కాలనీ తదితర ప్రాంతాలు నీటమునిగాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. శ్రీకాకుళం, గార, నరసన్నపేట, రణస్థలం, ఎచ్చెర్ల తదితర ప్రాంతాల్లో వర్ష ప్రభావం ఎక్కువగా కనిపించింది. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ జలమయమైంది. లోతట్టు ప్రాంతం కావడంతో వర్షపునీరు, మురుగునీరు చేరడంతో కోనేరును తలపించింది. మోకాలి లోతు నీరు చేరడంతో నాన్‌స్టాప్ కౌంటర్, కాంప్లెక్స్ పరిసరాలు మొత్తం నీట మునిగాయి. దీంతో ప్రయాణికులు, బస్సుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. పెద్దపాడు వద్ద జాతీయ రహదారిపై నీరు పోటెత్తడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

శ్రీకాకుళం రూరల్: రాగోలు పంచాయతీ రాయిపాడు సమీపంలో మూడు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పంచాయతీ సిబ్బంది, విద్యుత్ అధికారులు యుద్ధప్రాతిపదికన స్తంభాలను మార్చారు.



రాగోలు శివసాయి కాలనీలో శానిటేషన్ కార్మికుడి పాట్లు

భోజనాలు పంపిణీ

ఎచ్చెర్ల: తోటపాలెం సమీపంలో నీలమ్మకాలనీ నీట మునగడంతో కాలనీవాసులకు వీహెచ్‌పీ అధ్యక్షుడు ఆనందరావు భోజనాలు సిద్ధం చేశారు. ట్రిపుల్ ఐటీ ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సాయంతో భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో ఎన్ఎస్.ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పెద్దింటి ముకుందరావు పాల్గొన్నారు.



శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వర్షపు నీటిలో దిగి బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

స్వల్పంగా పెరిగిన వంశధార

హిరమండలం: హిరమండలం వంశధార గొట్టాబ్యారేజీ వద్ద మంగళవారం స్వల్పంగా వరదనీరు పెరిగింది. అల్పపీడనం ప్రభావంతో రెండు రోజులుగా పడుతున్న తేలికపాటి వర్షాలకు వరదనీరు వచ్చి చేరుతోంది. గొట్టాబ్యారేజీ వద్ద గరిష్ఠంగా 38.10 మీటర్లు గాను ప్రస్తుతం 37,90 మీటర్లు నీటిమట్టం ఉంది. బ్యారేజీలోకి ఇన్‌ఫ్లో 13411 క్యూసెక్కులు రాగా, అవుట్‌ఫ్లో 12708 క్యూసెక్కులు విడిచిపెట్టినట్లు డీఈ సరస్వతి తెలిపారు. ఒడిశా క్యాచ్‌మెంట్ ఏరియాలో 64 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైనట్లు చెప్పారు.



గొట్టా బ్యారేజీ నుంచి విడిచిపెడుతున్న వరదనీరు

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

ఆమదాలవలస: మునగవలసలో కనమట చిన్నప్పన్న అనే రైతుకు చెందిన ఆవు మేత కోసం వెళ్లగా సెలూన్ షాపు వద్ద విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందింది. ఆవు విలువ సుమారు రూ.30వేలు నుంచి రూ.40 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.



మునగవలసలో మృతిచెందిన ఆవు

మహాగణపతిం భజే..!

శ్రీముఖలింగం..
అష్ట వినాయకులకు నిలయం

సాధారణంగా ఏ ఆలయంలోనైనా ఒకే వినాయక విగ్రహం దర్శనమిస్తుంది. ప్రముఖ శైవ క్షేత్రం, విశిష్ట శిల్ప సంపదకు నిలయమైన శ్రీముఖలింగంలో మాత్రం అష్ట గణపతులు సాక్షాత్కరిస్తారు. అరుదైన ముఖాకృతులతో ఆకట్టుకుంటారు. వీటికి భక్తులు ప్రత్యేక పూజలు చేస్తుంటారు. – జలుమూరు

శక్తి గణపతి



దీర్ఘకాలిక బాధలు, అనారోగ్య సమస్యలు తొలగిపోవాలని ఈ గణపతిని పూజిస్తారు. ఇంద్రుని ఆలయం తూర్పు దిక్కున పశ్చిమ ముఖంగా దర్శనం ఇస్తారు స్వామి.

చింతామణి గణపతి



చింతలు, దు:ఖాలు, ఈతి బాధలు పోగొట్టే స్వామి. దక్షిణవైపు ఉత్తర ముఖంగా ఉంటారు.

డుండీ గణపతులు



పంచాయతన క్షేత్రానికి సంబంధించి కాశీలో రెండు గణపతి విగ్రహాలు ఉంటాయి. మళ్లీ శ్రీముఖలింగంలోనే రెండు గణపతులు కనిపిస్తారు. ఈ ఇద్దరు స్వాములను దర్శనం చేసుకుంటే చాలు మనస్సులో కోర్కెలు, మోక్షం సిద్ధిస్తుందని అర్చకులు చెబుతున్నారు. ఉత్తర ముఖం దక్షిణంలో కొలువు దీరి ఉంటారు.

సాక్షి గణపతి



భక్తులు ఆలయానికి వచ్చిన తర్వాత ముందుగా ఈ స్వామిని దర్శనం చేసుకుంటే ఈయన తన తండ్రి అయిన పరమేశ్వరునికి చెబుతారంట. భక్తులు నా అనుమతి తీసుకున్నారు.. మీరు మీ దర్శనం భాగ్యం కల్పించాలని కోరుతారట. దక్షిణ ముఖంగా ఉత్తర వైపు కొలువై ఉంటారు.

నాట్య గణపతి



కళాకారులు, విద్యార్థులు నాట్యం తదితర కళలు నేర్చుకునే ముందు ఈ స్వామిని దర్శించుకోవాలంటారు. తూర్పు ముఖం పశ్చిమలో భక్తులకు దర్శనం ఇస్తారు.

కార్యసిద్ధి గణపతి



మనస్సులో ఒక కార్యం తలచుకొని ఈ స్వామికి చెబితే చాలు ఆ కార్యం నెరవేరుతుంది. ఆలయం పైన దక్షిణ ముఖం ఉత్తర దిక్కుగా ఉంటారు.

వరసిద్ధి గణపతి



వరాలు ప్రసాదించే స్వామివారు. భక్తులు కోరిన వరాలు ఇస్తారు. వారాహి అమ్మవారు ముందు ఎడమ వైపు దక్షిణ ముఖంతో భక్తులు దర్శనం ఇస్తారు.

వెల్‌కమ్ గణేశా..!

స్వాగత సంబరం

- ఘన స్వాగతం పలుకుతూ స్వగ్రామాలకు గణపయ్య విగ్రహాలు
- మేళతాళాలతో ఊరేగింపు
- తయారీ ప్రదేశం నుంచి కొలువుదీరే ప్రదేశం వరకు ఒకటే సందడి



నరసన్నపేట వద్ద క్రేన్ ద్వారా గణనాథుడి తరలింపు

టెక్కలి/నరసన్నపేట: పల్లెటూర్లు.. గణనాథుడికి ఘన స్వాగతం పలుకుతున్నాయి. ఉత్సవ కమిటీలు తమ కలల రూపాన్ని శిల్పికి వివరించి.. తయారైన ప్రతిమను వారి వారి ఊర్లకు తీసుకెళ్లేందుకు ముందే శోభాయాత్ర తరహాలో సందడి చేస్తున్నాయి. విగ్రహానికి అనువైన వాహనాన్ని సమకూర్చి పూజలందుకునే పార్వతీ తనయుడ్ని ఊరికి స్వాగతిస్తున్నాయి. తమ ఊరికి వస్తున్న బొజ్జగణపయ్య రాకను తెలియజేసేలా బాణసంచా.. మేళతాళాలు..శంఖునాదంతో వెల్‌కమ్ చెబుతున్నాయి. కొందరైతే ఇతర జిల్లాల్లో విగ్రహాలు తయారు చేయించి స్వగ్రామాలకు తీసుకువెళుతున్నారు.

ఐకమత్యాన్ని పెంచే పండుగ..

వినాయక చవితి నిర్వహణ అంటేనే టీమ్ వర్క్ అంటున్నారు నిర్వాహకులు. ఈ ఏడాది ఎలాంటి విగ్రహాన్ని తయారు చేయించాలో నిర్ణయించడం.. గణపయ్య విగ్రహాన్ని సెలక్ట్ చేయడం.. పెద్దల సలహాలు తీసుకోవడం.. నవరాత్రుల నిర్వహణ ఎలా ఉండాలి.. ఆర్థిక వనరులు సమీకరణ.. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలపై సమావేశాలు నిర్వహించి ఒకే మాట మీద బృందం పని చేసే కార్యక్రమమే వినాయక చవితి ఉత్సవ నిర్వహణ అని చెబుతున్నారు. ఈ తొమ్మిది రోజులు ఊరంతా ప్రత్యేక సందడి నెలకొంటుందని అంటున్నారు. ఈ ఉత్సాహం కోసమే ఏడాది అంతా ఎదురుచూస్తామని చెబుతున్నారు.

30 ఏళ్లుగా నిర్వహిస్తున్నాం



ఈ తొమ్మిది రోజులు పండగ వాతావరణం ఉంటుంది. వినాయక చవితి రోజు బొమ్మనుతీసుకురావడం, పూజ నిష్ఠగా చేస్తాం. 30 ఏళ్లుగా నవరాత్రులు చేస్తున్నాం. ఈ ఏడాది అనకాపల్లిలో 8 అడుగుల బొమ్మను తయారు చేయించాం. – పీరు ఎర్రయ్య, విశ్రాంత ఆర్డీఓ, నరసన్నపేట

ఏడాదంతా ఎదురుచూస్తాం



వినాయక చవితి ఐకమత్యానికి నిదర్శనం. ఈ పండగ కోసం ఏడాదంతా ఎదురుచూస్తాం. పెద్దలతో పాటు యువకులు, గ్రామ ప్రజలందరూ ఐకమత్యంగా ఉత్సవాలు చేసుకుంటాం. ప్రతి ఏటా టెక్కలి వచ్చి వినాయక బొమ్మను తీసుకెళ్తాం. ఆ సందడే వేరు. – బి.సురేష్, దేవళభద్ర, నందిగాం మండలం

వాన హోరు.. కొనుగోళ్ల జోరు





వినాయక చవితి సందర్భంగా పూజా సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిటలాడాయి. జిల్లా కేంద్రంలోని పొట్టిశ్రీరాములు మార్కెట్‌లో జోరువానను కూడా లెక్కచేయకుండా జనాలు పోటెత్తడంతో కొనుగోళ్లు జోరుగా సాగాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం



- వినాయక మండపాల్లో జాగ్రత్తలు తప్పనిసరి
- వర్షాల నేపథ్యంలో విద్యుత్ షాక్‌లకు అవకాశం

తస్మాత్ జాగ్రత్త..!

అరసవల్లి: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలకు మండపాలు ముస్తాబయ్యాయి. సీరియల్ సెట్లు, ఎల్ఈడీ లైట్ల వెలుగులతో మండపాలు ధగధగలాడుతున్నాయి. అయితే ప్రస్తుతం వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఏమాత్రం ఆదమర్చినా ప్రాణాపాయం తప్పదని హెచ్చరిస్తున్నారు.

- వర్షాలు కురుస్తున్న క్రమంలో విద్యుత్ పరికరాలు తడవకుండా జాగ్రత్తలు వహించాలి. తడి చేతులతో విద్యుత్ పరికరాలను తాకకూడదు.
- విద్యుత్ లైసెన్స్ ఉన్న ఎలక్ట్రీషియన్లతోనే అలంకరణ పనులు చేయించాలి.
- మండపాలను విద్యుత్ స్తంభాలకు, ట్రాన్స్‌ఫార్మర్లకు కనీసం 3 మీటర్ల దూరంలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- విద్యుత్ పరికరాలకు సరైన ఎర్తింగ్ ఉండాలి. ఐఎస్ఐ ప్రమాణాలున్న నాణ్యమైన విద్యుత్ వైర్లు వాడాలి.
- డెకరేషన్ల విషయంలో సీరియల్ సెట్లు గోడలకు, లోహ వస్తువులకు తగలకుండా అమర్చాలి. ఎల్ఈడీ బల్బులు వాడటంతో తక్కువ విద్యుత్ వినియోగమవుతుంది.
- పరిసరాలన్నీ పొడిగా ఉండేలా చర్యలు చేపట్టాలి. అత్యవసరాలకు సమీపంలోని సచివాలయాల ఎనర్జీ అసిస్టెంట్లు, విద్యుత్ శాఖ ఏఈలను సంప్రదించాలి.

అందని 'ఉచిత' ఉత్తర్వులు..

జిల్లాలో వినాయక మండపాల్లో నవరాత్రుల్లో వినియోగించిన విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే భరిస్తుందని, మండపాలకు ఉచిత విద్యుత్ అందించే చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థకు ఎలాంటి లిఖితపూర్వక ఉత్తర్వులు జారీ కాలేదు. విద్యుత్ శాఖ మాత్రం ప్రభుత్వ ప్రకటన ప్రకారం జిల్లా అధికారుల బృందం (పంచాయతీ/మున్సిపాల్టీ, విద్యుత్, పోలీస్ తదితర శాఖలు) అనుమతి ఉన్న వినాయక మండపాల్లో ప్రత్యేక మీటర్లు అమర్చి రీడింగ్‌ను తీయించుకునేలా చర్యలు చేపట్టింది. ఉచితమనే విధానంపై స్పష్టత వస్తే ఎలాంటి బిల్లులు లేకుండా మండపాలకు విద్యుత్ వినియోగానికి వెసులుబాటు ఇవ్వనున్నట్లు అధికారులు ప్రకటిస్తున్నారు. అయితే చాలా ప్రాంతాల్లో వినాయక మండపాల నిర్వాహకులు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా చవితి వేడుకలకు సిద్ధమవుతున్నారు. ఇలాంటి మండపాలకు 'ఉచిత' విద్యుత్ అవకాశాలుండవనే సంకేతాలను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది.

ప్రాణాలు ముఖ్యం..



మన ప్రాణం కంటే ఏదీ ముఖ్యం కాదు అనే విషయాన్ని మరిచిపోవద్దు. గతంలో జిల్లాలో ఇదే సీజన్‌లో చాలా మంది యువత మృత్యువాత పడ్డారు. అలాంటి దుర్ఘటనలు జరగకుండా ఉండాలంటూ కచ్చితంగా లైసెన్స్ ఉన్న ఎలక్ట్రీషియన్స్ మాత్రమే విద్యుత్ అలంకరణ పనులు చేపట్టాలి. వినాయక మండపాలకు ఉచిత విద్యుత్‌పై లిఖితపూర్వక ఆదేశాల మేరకు చర్యలు చేపడతాం.
– నాగిరెడ్డి కృష్ణమూర్తి, ఎస్ఈ, శ్రీకాకుళం సర్కిల్

గణపతి అనుగ్రహం ఉండాలి



నరసన్నపేట : జిల్లా ప్రజలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. లక్ష్యాలకు ఎలాంటి విఘ్నాలు కలగకుండా, ప్రతి ఒక్కరిపై ఏడాదంతా గణపతి అనుగ్రహం ఉండాలని ఆకాంక్షించారు.

శుభం కలగాలి



ఆమదాలవలస: విఘ్నాలను తొలగించి వినాయకుడు అందరికీ శుభాలు కలిగించాలని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఆకాంక్షించారు. ఈ మేరకు జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.

మంచి జరగాలి



పలాస: హిందువులు సంప్రదాయబద్ధంగా జరుపుకునే వినాయక చతుర్థి అందరికీ మంచి చేకూర్చాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పలాస నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆకాంక్షించారు. వినాయక చవితి సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. మండపాల వద్ద, విగ్రహాల నిమజ్జనం సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



- ఔత్సాహిక విద్యార్థుల కోసం 'ప్రయాస్'
- 9, 10, ఇంటర్ విద్యార్థులకు సువర్ణావకాశం
- ప్రాజెక్టు సన్నద్ధతకు రూ.50 వేల మంజూరు
- సద్వినియోగం చేసుకోవాలని అధికారులు పిలుపు



పరిశోధనలకు ప్రోత్సాహం..!

శ్రీకాకుళం న్యూకాలనీ:

పరిశోధనల వైపు పాఠశాల, ఇంటర్ విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం నడుంబిగించింది. జాతీయ విద్య పరిశోధన శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) వారు 9, 10 మరియు ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులను పరిశోధన, ఆవిష్కరణ రంగాల్లో ప్రోత్సహించడానికి ప్రయాస్ (ప్రమోషకన్ ఆఫ్ రీసెర్చ్ ఆటిట్యూడ్ అమాంగ్ యంగ్ అండ్ ఆస్పైరింగ్ స్టూడెంట్స్) పథకానికి రూపకల్పన చేశారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ, పీజీ(లీడ్) కళాశాలలోని సెంటర్ ఫర్ అప్లయిడ్ సైన్సెస్ విభాగం (బయో టెక్నాలజీ, మైక్రో బయాలజీ), ఇండిజీనస్ సొసైటీ ఫర్ ఫ్రుగల్ సైన్స్ ఇన్వెన్సస్ (ఐఎస్ఎఫ్ఎస్ఐ)ల ఉమ్మడిగా సహకారంతో ప్రయాస్‌ను విద్యార్థులకు చేరువ చేసేందుకు శ్రీకారం చుట్టారు.

నైపుణ్యాలను పెంచేలా...

పరిశోధనల వైపు ఆకర్షితులుగా ఉన్న విద్యార్థులను మరింతగా ప్రోత్సహించేందుకు ప్రయాస్‌ను ఎన్‌సీఈఆర్‌టీ తెరపైకి తీసుకొచ్చింది. యువ, జిజ్ఞాస కలిగిన విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడమే ఈ పథకం ఉద్దేశం. పరిశోధనా నైపుణ్యాలను పెంపొందించేలా చేసేందుకు ఎంపికైన విద్యార్థుల బృందానికి ప్రాజెక్ట్ సన్నద్ధత, రూపకల్పన చేసేందుకుగాను రూ.50 వేలు నగదు ప్రోత్సాహకాన్ని అందజేయనున్నారు. ప్రస్తుత వాస్తవ ప్రపంచంలో ఉన్న సమస్యలను ఆధారంగా చేసుకొని, వాటికి సృజనాత్మక, శాస్త్రీయ పరిష్కారాలను చూపించే ఆసక్తి గల విద్యార్థులకు ఈ ప్రయాస్ పథకం చక్కని వేదికగా ఉపయోగపడనుంది. 9వ తరగతి నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈ పథకానికి అర్హులు. ఆసక్తి గల పాఠశాలలు, కళాశాలల నుంచి ఇద్దరు విద్యార్థులు, ఒక అధ్యాపకుడిని ఒక బృందంగా ఎంపిక చేయనున్నారు. పరిశోధనల వైపు ఆసక్తి కలిగినవారు ఈనెల 28లోగా శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల (లీడ్) కళాశాలను సంప్రదించాలని, మరిన్ని వివరాలకు 85559 11961 నంబర్‌ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు సూచించారు.



శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల (ఇన్‌సెట్లో) ఎన్‌సీఈఆర్టీ లోగో

సద్వినియోగం చేసుకోవాలి



ఎన్‌సీఈఆర్టీ రూపొందించిన ప్రయాస్ కార్యక్రమం చాలా గొప్పగా ఉంది. 9, 10 మరియు ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులను పరిశోధన, ఆవిష్కరణ రంగాల్లో ప్రోత్సహించడానికి ఉపయోగపడుతుంది. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ కణితి శ్రీరాములు, ప్రిన్సిపాల్, శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల (లీడ్)కాలేజీ

నైపుణ్యాలను పెంచడమే లక్ష్యం



యువ, జిజ్ఞాస కలిగిన విద్యార్థుల్లో పరిశోధనలపై ఆసక్తి పెంపొందించడమే ప్రయాస్ పథకం ముఖ్య లక్ష్యం. ప్రస్తుత వాస్తవ ప్రపంచ సమస్యలను ఆధారంగా చేసుకొని, వాటికి సృజనాత్మకత జోడించి, శాస్త్రీయ పరిష్కారాలను చూపించడం దీని ఉద్దేశం.

– డాక్టర్ మధమంచి ప్రదీప్, కళాశాల అప్లయిడ్ సైన్సెస్ హెచ్‌వోడీ, ఐఎస్ఎఫ్ఎస్ఐ అధ్యక్షుడు

ఈనెల 28లోగా సంప్రదించాలి



పాఠశాల/కళాశాల నుంచి ఇద్దరు విద్యార్థులు, ఒక అధ్యాపకుడు బృందంగా ఏర్పడాలి. ఒక వినూత్న ఆలోచనతో కళాశాల అప్లయిడ్ సైన్సెస్ విభాగాన్ని సంప్రదించాలి. ఈ బృందాన్ని ప్రోత్సహించడానికి కళాశాల తరుపున సిద్ధంగా ఉన్నాం. ఈనెల 28లోగా కళాశాలను సంప్రదించాలి.

– డాక్టర్ రోణంకి హరిత, బయో టెక్నాలజీ సీనియర్ లెక్చరర్, ఐఎస్ఎఫ్ఎస్ఐ కార్యదర్శి

క్లుప్తంగా

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



కొత్తూరు గ్రోమోర్ సెంటర్‌లో తనిఖీలు

శ్రీకాకుళం క్రైమ్/కొత్తూరు/హిరమండలం: జిల్లాలోని కొత్తూరు, హిరమండలం మండలాల్లో ఎరువుల దుకాణాల్లో మంగళవారం విజిలెన్స్ తనిఖీలు చేపట్టారు. కొత్తూరులోని మన గ్రోమోర్ సెంటర్‌లో రికార్డులు సక్రమంగా లేకపోవడంతో 16.95 టన్నుల కాంప్లెక్సు ఎరువుల అమ్మకాల నిలుపుదల చేసినట్లు విజిలెన్స్ ఎస్పీ బి.ప్రసాదరావు తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ సతీష్‌కుమార్, ఏఓలు సంధ్య, స్వర్ణలత, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎర్రన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు



పదోన్నతులు పొందిన వారితో పిరియా విజయ

అరసవల్లి: జిల్లా పరిషత్ యాజమాన్యంలో పనిచేస్తున్న పలువురు రికార్డు అసిస్టెంట్లను జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తూ జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మురపాక జెడ్పీ స్కూల్ రికార్డు అసిస్టెంట్ డి.రమాదేవిని వంగర మండలం ఎంఎస్ఆర్ పురం జెడ్పీ స్కూల్ జూనియర్ అసిస్టెంట్‌గా, లింగాలవలస రికార్డు అసిస్టెంట్ కె.హేమలతను అమలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు, గోవిందపురం రికార్డు అసిస్టెంట్ పి.జయలక్ష్మిని వజ్రపుకొత్తూరు మండలం ఒంకులూరు జెడ్పీ స్కూల్‌కు, బోరుభద్ర జెడ్పీ స్కూల్ రికార్డు అసిస్టెంట్ ఎ.గోపాలరెడ్డిని సంతబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయానికి, ఎచ్చెర్ల మండలం ఫరీదుపేట జెడ్పీ స్కూల్ రికార్డు అసిస్టెంట్ కె.పద్మలతను పాతపట్నం పీఆర్ఐ సబ్ డివిజన్ జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతులు కల్పిస్తూ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా, సి–సెక్షన్ సూపరింటెండెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎవరు 'అధ్యక్షా'..?

- టీడీపీ జిల్లా అధ్యక్ష స్థానానికి అభిప్రాయ సేకరణ
- త్రిసభ్య కమిటీ నేతలతో హోంమంత్రి అనిత సమావేశం
- ప్రాధాన్యత సంతరించుకున్న లక్ష్మీదేవి భేటీ

శ్రీకాకుళం : జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవి ఎంపికకు కసరత్తు మొదలైంది. కేంద్ర, రాష్ట్ర మంత్రులతో పాటు శాసనసభ్యుల అభిప్రాయాలను సేకరించేందుకు హోం మంత్రి అనిత మంగళవారం శ్రీకాకుళం వచ్చారు. ఆమె నేతృత్వంలో త్రిసభ్య కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. అధ్యక్ష పదవి కోసం చౌదరి బాబ్జీ, మొదలవలస రమేష్, పీరుకట్ల విఠల్, ఆనెపు రామకృష్ణలు దరఖాస్తు చేసుకోగా.. అవకాశమిస్తే ఆ పదవి చేపట్టేందుకు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావులు సంసిద్ధత వ్యక్తం చేశారు. మహిళల కోటాలో తన పేరును కూడా పరిశీలించాలని తమ్మినేని సుజాత కోరారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ అభిప్రాయాలను అధిష్టానానికి నివేదిస్తామని తెలిపారు. అనుబంధ విభాగాల అధ్యక్షులపైనా అభిప్రాయాలను సేకరించామని చెప్పారు. ప్రతి విభాగానికి ఇద్దరు నుంచి ముగ్గురు పేర్లను అధిష్టానానికి నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు గొండు శంకర్, మామిడి గోవిందరావు, గౌతు శిరీష, కూన రవికుమార్, బెందాళం అశోక్, బగ్గు రమణమూర్తి, మాదారపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



హోంమంత్రి అనితతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి

ప్రత్యేకంగా కలిసిన లక్ష్మీదేవి..

శ్రీకాకుళం మాజీ శాసన సభ్యురాలు గుండ లక్ష్మీదేవి హోం మంత్రి అనితతో ప్రత్యేకంగా సమావేశం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. సుమారు 20 నిమిషాల పాటు భేటీ అయ్యారు. హోంమంత్రి ఇటీవల అరసవల్లి వచ్చినప్పుడు కూడా లక్ష్మీదేవి కలిసిన సంగతి తెలిసిందే. అయితే జిల్లా పార్టీ సమావేశాలకు ఆహ్వానం లేకపోవడంతో ఆమె ఇప్పటివరకు ఏ సమావేశంలోనూ పాల్గొనడం లేదని ప్రచారం జరుగుతుండగా, మంగళవారం మాత్రం హోంమంత్రితో సమావేశం కావడం ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారింది.

జీతాలు మహాప్రభో..!

- ట్రిపుల్ ఐటీ కాంట్రాక్టు సిబ్బందికి నేటికీ అందని వైనం

ఎచ్చెర్ల: అధికారంలోకి వస్తే ప్రతినెలా ఒకటో తేదీనే జీతాలు అందజేస్తాం. ఇవి ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు చెప్పిన మాటలు. అయితే పరిస్థితి మాత్రం అందుకు విరుద్ధంగా ఉంది. ఈనెలలో 26వ తేదీ గడిచినా జీతాలు రాక ట్రిపుల్ ఐటీ కాంట్రాక్టు ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. ఇచ్చే అరకొర వేతనాలను ఇన్ని రోజులు ఇవ్వకుండా ఉంటే పూట గడిచేది ఎలా అని ప్రశ్నిస్తున్నారు. గతంలో వేతనాలు ఆలస్యమైతే సిబ్బందికి వారి జీతంలో 50 శాతం సొమ్మును అడ్వాన్సుగా చెల్లించేవారు. అలా తీసుకున్న సొమ్మును జీతాలు ఇచ్చేటప్పుడు మినహాయించేవారు. ఇప్పుడు అడ్వాన్సులు కూడా ఇవ్వకపోవడంతో కుటుంబ ఖర్చులకు, ఇతర అవసరాలకు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

రుణాలు చెల్లించేందుకు అప్పులు

కాంట్రాక్టు అధ్యాపకులందరూ ఆర్థిక వెసులుబాటును బట్టి గృహావసరాల కోసం రుణాలు తీసుకుంటారు. బ్యాంకుల్లో చేసిన అప్పులకు క్రెడిట్ కార్డులపై తీసుకున్న వాటికి బ్యాంకు ఖాతాల్లో తప్పనిసరిగా డబ్బులు సిద్ధంగా ఉంచాలి. దీంతో అప్పులు చేసి ఖాతాలో ఉంచుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈఎంఐలకు సరిపడా నగదు లేకపోతే సిబిల్ స్కోర్ తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటికి తోడు కుటుంబం గడవడానికి, పిల్లల ఫీజులు చెల్లించడానికి అనేక అవసరాలకు డబ్బులు అవసరం కాగా అప్పు చేయాల్సి వస్తోంది. సకాలంలో జీతాలు ఇస్తే ఈ తలనొప్పి ఉండదని ఉద్యోగులు పేర్కొంటున్నారు.



ఎచ్చెర్లలోని ట్రిపుల్ ఐటీ ప్రాంగణం

140 మంది కాంట్రాక్టు ఉద్యోగులు

కాంట్రాక్టు పద్ధతిలో మెంటార్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, గెస్ట్ ఫ్యాకల్టీలు, ల్యాబ్ అసిస్టెంట్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఐటీ మెంటార్లు పనిచేస్తున్నారు. వీరందరూ కలిపి 140 పైగానే ఉంటారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు యూనివర్సిటీనే నెల ప్రారంభంలోనే వేతనాలను చెల్లించింది. కాంట్రాక్టు ఉద్యోగులకు ఇంతవరకూ వేతనాలు చెల్లించలేదు. అందువలన ఇకనైనా సకాలంలో వేతనాలు చెల్లించాలని కోరుతున్నారు.

పోక్సో కోర్టు ఎస్‌పీపీగా విశాలాక్షి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కేంద్రంలోని పోక్సో కోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నగరానికి చెందిన న్యాయవాది జీవీఎస్‌యూ విశాలాక్షి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి ఉత్తర్వులను మంగళవారం విడుదల చేశారు. ఈమె ఈ పోస్టులో మూడు సంవత్సరాలు ఉంటారు.

ఆర్గానిక్ కెమిస్ట్రీ కోర్సు మంజూరు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో కొత్తగా మొదటిసారిగా బీఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ సింగిల్ మేజర్ కోర్సు శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలకు మంజూరైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీరాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మా, కెమికల్ సంస్థలు, పరిశ్రమల్లో స్థిరపడేందుకు ఆసక్తి చూపించే శ్రీకాకుళం జిల్లా విద్యార్థుల కోసం ఈ కోర్సును అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించారు. ఈ విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్ పోర్టల్‌లో కోర్సును విద్యార్థులు ఎంపిక చేసుకోవచ్చని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు 90307 68474 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య



దీపిక మృతదేహం

పాతపట్నం: ఇంట్లో ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన పాతపట్నం మండల కేంద్రంలోని ప్రశాంతనగర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. రాజస్థాన్ రాష్ట్రంలోని జలురే జిల్లా తోటల్ గ్రామానికి చెందిన భార్యాభర్తలు హీరా రామ్ చౌదరి, దీపిక కుమారి(23)లు బతుకుతెరువు కోసం ఆరు సంవత్సరాల క్రితం పాతపట్నం వచ్చారు. భర్త హీరారామ్ హార్డ్‌వేర్ షాపులో పనిచేస్తున్నాడు. పిల్లలు లేకపోవడంతో భార్యభర్తలు మాత్రమే ఇంట్లో ఉంటున్నారు. ఇటీవల భార్యాభర్తలకు తరుచూ గొడవలు జరుగుతున్నాయని ఇరుగుపొరుగువారు చెబుతున్నారు. దీంతో మంగళవారం భర్త షాపుకు వెళ్లిన తర్వాత దీపికా కుమారి ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. భర్త హీరారామ్ ఇంటికి వచ్చాక తలుపులు వేసి ఉన్నాయి. ఎంత పిలిచినా బయటకు రాకపోవడంతో తలుపులు తెరిచి చూడగా ఆమె ఉరికి వేలాడుతూ విగత జీవిగా కనిపించిందని భర్త తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ బి.లావణ్య సంఘటన స్థలానికి చేరుకుని, విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయడంతో టెక్కలి డీఎస్పీ డి.లక్ష్మణరావు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అచ్చెన్నాయుడిని బర్తరఫ్ చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న పేరాడ తిలక్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వ్యవసాయశాఖలో జరుగుతున్న అవినీతిపై దర్యాప్తు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ వినతిపత్రం అందించారు. ఈ మేరకు వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయాధారిత రాష్ట్రమైన ఏపీలో వ్యవసాయ శాఖ పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని, ఆ శాఖ మంత్రి వ్యవసాయ శాఖ పరిధిలో జరుగుతున్న రైతు సంక్షేమ కార్యక్రమాల్లో అవినీతికి పాల్పడడం దారుణమన్నారు. తన పీఎస్ పోలినాయుడు ద్వారా అచ్చెన్నాయుడు అవినీతికి పాల్పడ్డారని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని వ్యవసాయ శాఖ జీఎం రాజమోహన్‌కు, వ్యవసాయ శాఖ కమిషనర్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ ద్వారా తెలియజేశారు. రైతులకు అందజేస్తున్న పరికరాల్లో అవినీతికి పాల్పడుతున్న అచ్చెన్నాయుడిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసి ఆ శాఖపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

పాఠశాల సందర్శన

సంతబొమ్మాళి: మండలంలోని లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) అధ్యాపకులు చలపాక రమణ, మురళి మంగళవారం సందర్శించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలు, మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. విద్యార్థుల ప్రగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు.

దివ్యాంగుల పింఛన్లు తొలగించడం అన్యాయం

- ఎమ్మెల్సీ నర్తు రామారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

ఇచ్ఛాపురం రూరల్: కూటమి ప్రభుత్వం పింఛన్ల పునః పరిశీలన పేరుతో దివ్యాంగుల పింఛన్లు తొలగించడం అన్యాయమని ఎమ్మెల్సీ నర్తు రామారావు మండిపడ్డారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 50 ఏళ్లు నిండిన వారికి పింఛన్లు ఇస్తామంటూ ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి నాయకులు, గెలిచాక ఒక్క పింఛన్ ఇవ్వలేదు సరికదా.. ఉన్నవాటిని తొలగించి లబ్ధిదారుల ఉసురు పోసుకుంటున్నారని ధ్వజమెత్తారు. జిల్లాలో సుమారు 30 వేల మంది దివ్యాంగులకు అన్యాయం చేశారని, వారంతా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తే ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఉద్దేశపూర్వకంగా పింఛన్ల ఏరివేతకు సిద్ధపడిన కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎండగట్టేందుకు వైఎస్సార్‌సీపీ బాధితుల తరుపున పోరాటం చేస్తుందని తెలియజేశారు. ఆయనతో పాటు మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, బాకి లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

విద్యతోనే ఉత్తమ భవిష్యత్

- సెంచూరియన్ వర్సిటీ ఛాన్సలర్ జీఎస్ఎన్ రాజు



మాట్లాడుతున్న సెంచూరియన్ వర్సిటీ ఛాన్సలర్ జీఎస్ఎన్ రాజు

ఎచ్చెర్ల: విద్యతోనే ప్రతి ఒక్కరికీ ఉత్తమ భవిష్యత్ లభిస్తుందని సెంచూరియన్ వర్సిటీ ఛాన్సలర్, ఆంధ్రా యూనివర్సిటీ పూర్వపు వీసీ ఆచార్య జీఎస్ఎన్ రాజు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ ప్రవేశాలు పొందిన ప్రథమ సంవత్సరం విద్యార్థుల పరిచయ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థి ఉజ్వల భవిష్యత్తు అందుకోవడంలో అధ్యాపకులతో పాటు తల్లిదండ్రులకు కూడా బాధ్యత ఉందన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (గుంటూరు) పూర్వ వీసీ, బీఆర్ఏయూ అంబుడ్స్‌మెన్ ఆచార్య వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా నేటి యువతరం మారితేనే కెరియర్ ఉంటుందన్నారు. ట్రిపుల్ ఐటీ (అగర్తల) పూర్వ డైరెక్టర్ ఆచార్య పీఎస్ అవధాని మాట్లాడుతూ విద్యార్థులు సమయపాలన కలిగి ఉండాలని సూచించారు. బీఆర్ఏయూ వీసీ కేఆర్ రజనీ మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడి, అవాంతరాలు తట్టుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ఆచార్య బి.అడ్డయ్య, ఇంజినీరింగ్, ఆర్ట్స్ కళాశాలల ప్రిన్సిపాల్స్ డా.సీహెచ్ రాజశేఖరరావు, ఎం.అనురాధ, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.ఉదయ్‌భాస్కర్, ఎస్‌వో డా.కె.సామ్రాజ్యలక్ష్మీ, ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్ పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన ట్రిపుల్ ఐటీ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ట్రిపుల్ ఐటీ సిబ్బంది

ఎచ్చెర్ల: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఎచ్చెర్ల ప్రాంగణంలో ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులు ఈనెల 21వ తేదీ నుంచి 24 వరకు తాడేపల్లిగూడేం, ప్రత్తిపాడుల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగాసనాల పోటీల్లో మూడు సిల్వర్, నాలుగు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. 14 నుంచి 18 ఏళ్ల వయస్సు కేటగిరీల్లో వివిధ విభాగాల్లో మెడల్స్ సాధించారు. ట్రెడిషనల్ విభాగంలో ఎ.మేఘన ద్వితీయ స్థానం, లెగ్ బ్యాలెన్స్ విభాగంలో ఎస్.జయచంద్ర ద్వితీయ స్థానం, బ్యాక్వార్డ్ బెండింగ్‌లో పి.కారుణ్య బ్రాంజ్, ఆర్టిస్ట్ పెయిర్‌లో కె.మేఘన, ఎ.రాధికలు బ్రాంజ్, సూఫియా విభాగంలో ఈ.భరత్‌సాయి బ్రాంజ్, హ్యాండ్ బ్యాలెన్స్‌లో బి.జోగేంద్రసాయి బ్రాంజ్ మెడల్స్‌తో సత్తాచాటారు. దీంతో విద్యార్థులను కళాశాల సిబ్బంది మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌వో డాక్టర్ మునిరామకృష్ణ, ఫైనాన్స్ అధికారి వాసు, డీన్ డాక్టర్ గేదెల రవి, యోగా విభాగాధిపతి డాక్టర్ ఈశ్వరరావు, యోగా విభాగాధిపతి జి.ఈశ్వరరావు, అధ్యాపకులు కె.అర్చన తదితరులు పాల్గొన్నారు.

సౌండ్ సిస్టం పరికరాలు చోరీ



గోడౌన్‌ను చూపిస్తున్న బాధితుడు

సారవకోట: మండలంలోని అలుదు గ్రామంలో కొలుమూరు చంద్రశేఖర్‌కు చెందిన రూ.1.20 లక్షలు విలువ చేసే సౌండ్ సిస్టం పరికరాలు చోరీకి గురైయ్యాయి. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. కొన్ని రోజులు క్రితం శ్రీకాకుళం రూరల్ మండలం పొన్నాడ గ్రామానికి చెందిన ఒక యువకుడు తనకు తల్లిదండ్రులు ఎవరూ లేరని చెప్పి, పని కల్పించి భోజనం, కొంతకూలి ఇస్తే సరిపోతుందని కోరాడు. దీంతో ఆ యువకుడికి పని కల్పించి పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు సప్లయర్స్, సౌండ్ సిస్టం ఏర్పాటు చేసేందుకు చంద్రశేఖర్ తీసుకెళ్లేవాడు. అప్పటినుంచి నమ్మకంగా ఉంటూ పరికరాలు ఉన్నచోటే రాత్రిపూట పడుకునే వాడు. అయితే ఈ నెల 24న ఆ యువకుడితో ఉన్న మరో యువకుడికి మద్యం తాగించాడు. అనంతరం అర్ధరాత్రి తర్వాత గోడౌన్‌లో ఉన్న సీసీ కెమెరాల వైర్లు కట్ చేసి రూ.1.20 లక్షలు విలువ కలిగిన సౌండ్ సిస్టం సామగ్రి దొంగిలించుకుని పోయినట్లు ఆయన తెలిపారు. దీనిపై సారవకోట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

కన్యాకుమారి.. డైరెక్టర్ మనోడే మరి

- 'కన్యాకుమారి' చిత్ర దర్శకుడు సృజన్ సిక్కోలు వాసి
- శ్రీకాకుళం పరిసరాల్లోనే మొత్తం షూటింగ్



శాలిహుండం కొండపై ప్రథమ పూజ అనంతరం నటీనటులతో చిత్ర దర్శకుడు సృజన్ తదితరులు

నరసన్నపేట: తెలుగు రాష్ట్రాల్లో విడుదలకు సిద్ధమైన 'కన్యాకుమారి' సినిమా డైరెక్టర్, నిర్మాత సృజన్ అట్టాడ మన సిక్కోలు వాసి. మొదటి సినిమా పుష్పక విమానంతో సత్తాచాటిన సృజన్ ద్వితీయ ప్రయత్నంగా కన్యాకుమారిని తెరకెక్కించారు. శాలిహుండం కొండపై వెలసిన వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రథమ పూజ చేసి సినిమా షూటింగ్ ప్రారంభించారు. నరసన్నపేట, పోలాకి మండలాల్లోని కోమర్తి, ఉర్లాం, చింతువానిపేట, లింగాలపాడు, దూకులపాడు, మాకివలస, దేవాది, మడపాం, రాళ్లపాడు, మబగాం, వీఎన్ పురం, శ్రీముఖలింగం గ్రామాల్లోనే దాదాపుగా సినిమా షూటింగ్ చేశారు. అలాగే కళింగ పట్నం తీరంలో కొన్ని షాట్లు తీశారు. శ్రీకాకుళంలోని ఒక వస్త్ర షోరూంలో హీరోయిన్ గీత్ షైనీపై సన్నివేశాలు చిత్రీకరించారు. స్థానిక యాసతోనే హీరో హీరోయిన్ల సంభాషణలు ఉండడం విశేషం. దర్శకుడు అట్టాడ సృజన్ కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు కుమారుడు. బుధవారం వినాయకచవితి సందర్భంగా సినిమా రిలీజ్ చేస్తున్నారు.

శ్రీకాకుళం అందాలను చూపించాం

సినిమా షూటింగ్‌లకు శ్రీకాకుళం జిల్లా చాలా అనుకూలంగా ఉంది. శ్రీకాకుళం చుట్టూనే సినిమా అంతా తీశాం. శ్రీకాకుళం జిల్లాలో పల్లె అందాలను చూపించనున్నాం. హీరోగా శ్రీ చరణ్ , హీరోయిన్‌గా గీత్ షైనీ నటించారు. ఇక్కడి యువతీ యువకుల మధ్య సాగే ప్రేమకథే ఈ సినిమా.

– సృజన్, దర్శకుడు

సౌమ్యకు నోటీసులు

శ్రీకాకుళం: పొందూరు కేజీబీవీ నుంచి కంచిలి బదిలీ అయిన ప్రిన్సిపాల్(ఎస్ఓ) సౌమ్యకు సమగ్ర శిక్ష ఏపీసీ మంగళవారం నోటీసులు జారీ చేశారు. పొందూరులో బాధ్యతలను అక్కడి ప్రిన్సిపాల్‌కు అప్పగించి వెంటనే కంచిలిలో విధుల్లో చేరాలని ఆదేశించారు. బదిలీ జరిగినప్పటి నుంచి మెడికల్ లీవ్‌లో ఉన్నట్లు చెబుతున్నారని, సెలవు మంజూరు కాలేదని పేర్కొన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు మెడికల్ లీవ్ ఉండదని, ఈ కారణంగానే సెలవు పొడిగించాలని చేసుకున్న దరఖాస్తును కూడా తిరస్కరించినట్లు స్పష్టం చేశారు. గతంలో పెట్టిన మెడికల్ లీవ్‌ను మాత్రం మానవతా దృక్పథంతో లాస్ ఆఫ్ పేగా పరిగణిస్తామని పేర్కొన్నారు

కలెక్టర్‌ను కలిసిన సౌమ్య

నోటీసు అందుకున్న అనంతరం సౌమ్య కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో కలిశారు. త్వరలోనే న్యాయం చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. నోటీస్ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లగా, దానిపై కూడా ఏపీసీతో మాట్లాడతానని చెప్పినట్లు భోగట్టా.